క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వైభవంగా నిత్య కల్యాణం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పెందుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో సోమవారం గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్‌–8 కమిషనర్‌ ఎం.మల్లయ్యనాయుడు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికల సంరక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్‌ఎస్‌ మూర్తి, ఏపీడీ శ్రీరామ్‌, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్‌ అందజేస్తున్న సూపరింటెండెంట్‌ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన ఆరిశెట్టి సుధాకర్‌ అనే దాత రూ. లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్‌ సిరిపురపు కనకరాజు బాండ్‌ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

వ్యక్తి అదృశ్యం


రామకృష్ణ

పరవాడ: లంకెలపాలెంలో నివాసం ఉంటున్న వాన రామకృష్ణ(39) ఈ నెల 27 నుంచి కనిపించడం లేదని అతని భార్య తులసి సోమవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం చిన్నకలగాం గ్రామానికి చెందిన వాన రామకృష్ణ భార్య తులసి ఇద్దరు పిల్లలతో మూడు నెలల నుంచి లంకెలపాలెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. తాపీ మేస్త్రిగా పని చేస్తూ భార్య పిల్లలను పోషించుకొంటున్నాడు. తాపీ పనులకు వెళ్లిన రామకృష్ణ ఈ నెల 27 రాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

2న మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో వచ్చే నెల 2వ తేదీన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏవో షేక్‌ బాబూరావు సోమవారం తెలిపారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొవాలని కోరారు.

ప్రతిష్టాత్మకంగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’


మందులు అందిస్తున్న ముమ్మన దేముడు, నాయకులు

పెందుర్తి: పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్‌ ముమ్మన దేముడు అన్నారు. లక్ష్మీపురం,గవరపాలెం సచివాలయం ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ముమ్మన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్‌ ఆఫీసర్‌ దేవిశ్రీ, జోన్‌–8 జేసీఎస్‌ ఇన్‌చార్జి మనలత జోబ్‌దాస్‌(చిన్ని), వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు కాళ్ల దేవి వెంకట గంగాధర్‌(పెద్ద), నాయకులు పులమరశెట్టి లక్ష్మణ్‌, చిట్టిబోయిన వెంకటరమణ, చిట్టిబోయిన అప్పలరాజు, పెంటకోట శంకర్‌, లావణ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంటలో:
జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదిరెడ్డి మురళి ప్రారంభించారు. అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ వైద్యులు దాదాపు 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జోనల్‌ కమిషనర్‌ మల్లయ్యనాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 80 వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొణతాల భాస్కర్‌ పిలుపునిచ్చారు. పిలుపునిచ్చారు. జీవీఎంసీ 80 వార్డు


రోగులకు మందులు అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి భాస్కర్‌

కార్పొరేటర్‌ కొణతాల నీలిమ పర్యవేక్షణలో తాడి గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజారోగ్యామే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిత్యం ఆలోచించే నేత సీఎం జగన్‌ మాత్రమేనన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం సమాజానికి దోహదపడతాయని


వేపగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో బీపీ చెక్‌ చేయించుకుంటున్న ఆదిరెడ్డి మురళి

నమ్మి ఆ రంగాలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి అమలు చేసిన 108, ఆరోగ్య శ్రీ పథకాలను కొనసాగిస్తూనే మన సీఎం వైఎస్‌ జగన్‌ ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ ప్రవేశపెట్టి ప్రజా మన్ననలు పొందుతున్నారని రత్నాకర్‌ కొనియాడారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమ పద్ధతిలో రెవెన్యూ రికార్డులు

సబ్బవరం: రెవెన్యూ గ్రామాల వారీగా రికార్డులు భద్రపరచాలని కోనేరు రంగారావు కమిటీ(కెఆర్‌ఆర్‌సి) స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రవీంద్రరావు సూచించారు. తహసీల్దార్‌ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు భద్రపరిచే రూమ్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో ఉన్న 33 రెవెన్యూ గ్రామాల రికార్డులను క్రమపద్ధతిలో భద్రపరచాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వారం రోజుల్లో మరోసారి వచ్చి రికార్డు రూమ్‌ను పరిశీలిస్తానని అప్పటికి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. డిజిటల్‌ అసిస్టెంట్‌కు రికార్డుల రూమ్‌ నిర్వహణ బాధ్యతలు అప్పగించ


డీటీకి సూచనలిస్తున్న ఎస్‌డీసీ రవీంద్రరావు

నున్నట్లు తెలిపారు.ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్‌ వెంకట్‌,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌ గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 10 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్‌–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 10 వినతులు వచ్చాయి. గోపాలపట్నం ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. జోన్‌–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై పూర్తి నిఘా

సీపీ రవిశంకర్‌

గోపాలపట్నం: రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంచాలని నగర పోలీస్‌ కమిషనర్‌ రవిశంకర్‌ ఆదేశించారు. వెస్ట్‌ ఏసీపీ కార్యాలయంతో పాటు ఎయిర్‌పోర్టు పోలీస్‌ స్టేషన్‌, కంచరపాలెం ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెస్ట్‌ సబ్‌ డివిజన్‌ ఏసీపీ కార్యాలయంలో నమోదవుతున్న పలు కేసులు గురించి ఆరా తీశారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సబ్‌ డివిజన్‌ పరిధిలో ఎన్‌డీపీఎస్‌ కింద నమోదైన కేసులతో పాటు పలు మార్లు అరెస్ట్‌ అయిన ఫెడ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు. డివిజన్‌ పరిధిలోని స్టేషన్ల పని తీరుపై ఏసీపీ అన్నెపునరసింహ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరును పరిశీ


ఏసీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సీపీ రవిశంకర్‌

లించారు. ట్రాఫిక్‌ రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పోలీస్‌ స్టేషన్‌లో సిబ్బందిని పని తీరును పరిశీలించారు. పెండింగ్‌ కేసుల గురించి విచారించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీసీపీ–2 ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెదల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్థాపంతో ఓ వ్యక్తి చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మాదేటి గార్డెన్స్‌లో గుప్తా(48), పవన్‌శెట్టి సావిత్రి దంపతులు నివసిస్తున్నారు. రెండేళ్లుగా నోటి క్యాన్సర్‌తో అతడు బాధపడుతున్నాడు. ఎంవీపీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్‌ హాస్పిటల్‌లో ఆపరేషన్‌ చేయించుకున్నాడు. కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న గుప్తా సోమవారం ఇంట్లో ఉన్న చెదల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న భర్త నోటి నుంచి రక్తం రావడాన్ని భార్య గమనించి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుప్తా మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో మేయర్‌.. సైకిల్‌పై కమిషనర్‌


ఆటోలో జీవీఎంసీకి చేరుకున్న మేయర్‌

- సొంత వాహనాలు వదిలి కార్యాలయానికి పయనం
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విన్నపం

డాబాగార్డెన్స్‌: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్‌ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ కోరారు. మేయర్‌ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్‌, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్‌ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.


తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్‌

మహాధర్నాను విజయవంతం చేయాలి

డాబాగార్డెన్స్‌: దేశంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్‌ నరసింగరావు పిలుపునిచ్చారు. నవంబర్‌ 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సిటూ జిల్లా కౌన్సిల్‌ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు తదితర అన్ని తరగతుల ప్రజానీకంపై తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. దీంతో పాటు రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసేలా అనేక చర్యలు చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్‌ కోడ్స్‌ రద్దు చేయాల చేయాలన్న డిమాండ్లతో అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబర్‌ 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు


తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్‌ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్‌బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలు మార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతో


మంగరాజు గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

పాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్‌, స్టేట్‌ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్‌ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్‌ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. తనిఖీలకు సంబంధించి జీఎస్టీ అధికారులు ఎలాంటి సెర్చ్‌ వారెంట్లు తనకు చూపలేదని మంగరాజు తెలిపారు. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

8న విద్యా సంస్థల బంద్‌

- జయప్రదం చేయాలని జేఏసీ పిలుపు


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చేపట్టి నవంబర్‌ 8వ తేదీతో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బంద్‌ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పోరాటాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెయ్యి రోజులుగా కార్మికులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుతంత్రాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీని గద్దె దించి, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. విద్యార్థులు, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్‌ ప్రెసిడెంట్‌ యు.ఎస్‌.ఎన్‌.రాజు, నాయకులు రాంబాబు, ఎల్‌.జె.నాయుడు పాల్గొన్నారు.

సంతబయలులో ట్రాఫిక్‌ కష్టాలు


పరవాడ సంతబయలులో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సులు(ఫైల్‌)

- ఇరుకు రోడ్డులో భారీవాహనాల రాకపోకలు
- రోడ్డుపై వ్యాపారాలతో ఇబ్బందులు

పరవాడ: అసలే ఇరుకు రోడ్డు .. ఆపై భారీ వాహనాల రాకపోకలతో పరవాడ గ్రామంలో తరచూ ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. మరో వైపు మంగళవారం సంత రోజు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పరవాడలో మంగళవారం జరిగే వారపు సంత రోజున కూరగాయలు, పండ్ల వ్యాపారులు, కోళ్ల వ్యాపారులతో పాటు చిరు వ్యాపారులు లావాదేవీలను రోడ్లపై నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోడ్లను వ్యాపార స్థావరాలుగా ఉపయోగించడంతో అనకాపల్లి, విశాఖ, గాజువాక ప్రాంతాల నుంచి యలమంచిలి, వాడచీపురుపల్లి, తంతడి తదితర ప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు తప్పించడానికి సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల సంత బయలులో ఆర్టీసీ బస్సులు తప్పించుకునే క్రమంలో గంటల తరబడి ట్రాఫిక్‌ నిలిచిపోయింది. పరవాడ–మండల కాంప్లెక్సు రహదారి ఇరుగ్గా మారడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. బొంకుల దిబ్బ–సంతబయలు రోడ్డులో కూడా ఇదే పరిస్థితి ఉంది. వారపు సంత రోజున ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్‌ తరలిస్తున్న వాహనాలు సీజ్‌

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు నక్కవానిపాలెం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఓ ప్రైవేటు ల్యాండ్‌లో అక్రమంగా స్టాక్‌ వేసిన గ్రావెల్‌ను పొక్లెయిన్‌తో లారీలకు లోడ్‌ చేస్తుండగా మైనింగ్‌ అధికారులు సోమవారం పట్టుకొని సీజ్‌ చేశారు. సీజ్‌ చేసిన వాహనాలను స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ స్వాతి తెలిపారు.మైన్స్‌ ఏడీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు దాడులు చేసి వాహనాలు సీజ్‌ చేయడంతో పాటు అపరాధరుసుం వసూలు చేయనున్నట్లు చెప్పారు.మైనింగ్‌ చట్టం ప్రకారం మట్టి,గ్రావెల్‌ అనుమతులు లేకుండా తరలించకూడదన్నారు. స్టాక్‌ చేసిన గ్రావెల్‌ ఎలా వచ్చిందో విచారణ చేపట్టి అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.


గ్రావెల్‌ తరలిస్తుండగా సీజ్‌ చేసిన లారీ

అన్ని రంగాల కార్మికులకు ఈ-శ్రమ్‌ కార్డులు

చోడవరం సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ

చోడవరం: అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా విధిగా ‘ఈ- శ్రమ్‌’ కార్డులను పొందాలని చోడవరం సహాయక కార్మిక అధికారి పి. సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పరిధిలో చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, కె. కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ, మాడుగుల, అరకు, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అనంతగిరి, డుంబ్రిగుడ, జి. మాడుగుల, హుకుంపేట మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టు, పారిశుద్ధ్య, తదితర రంగాల కార్మికులంతా విధిగా ఈ- శ్రామ్‌ కార్డులు పొందాలని సూచించారు. కార్డు కలిగిన కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షల బీమాతోపాటు 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్‌ సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ- శ్రమ్‌ కార్డులకు ఉచితంగా దరఖాస్తులు చేస్తున్నారని సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్‌ వారోత్సవాలు ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ విజిలెన్స్‌ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవంబర్‌ 5 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్‌ ప్రధాన పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్‌ సీఎండీ అతుల్‌ భట్‌, డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్‌.సి.పాండే, చీఫ్‌ విజిలెన్స్‌ కమిషనర్‌ (సీవీవో) డాక్టర్‌ ఎస్‌.కరుణరాజు, సీనియర్‌ అధికారులు, ఉద్యోగులు పాల్గొని సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన అన్ని విభాగాలు, గనులు, లైజన్‌, మార్కెటింగ్‌ కార్యాలయాల్లోని వివిధ ప్రదేశాల్లో ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు.


విజిలెన్స్‌ వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేవరకూ పోరాటం

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తి ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక శక్తిని ఆపాలనుకునే ఇటువంటి ప్రభుత్వ పాలనను మునుపెన్నడూ చూడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 991వ రోజు, సోమవారం స్టీల్‌ప్లాంట్‌ సింటర్‌ప్లాంట్‌ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ఎన్నటికీ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరంతరాయంగా పోరాటం చేస్తునే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

ఇంటి ముందు పార్క్‌ చేసిన బైక్‌ దగ్ధం



అక్కిరెడ్డిపాలెం: ఇంటి బయట పార్క్‌ చేసిన బైక్‌ అగ్నికి ఆహుతైంది. బాధితుడు, స్థానికులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ పనులు చేసుకునే బసవ సంతోష్‌ కుమార్‌, అతని తల్లి నాతయ్యపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సంతోష్‌ కుమార్‌ స్నేహితుడు ఊరు వెళ్తుండటంతో స్నేహితుడి పల్సర్‌ బైక్‌ను వాడుకోవటానికి తీసుకున్నారు. ఆదివారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు పార్క్‌ చేశాడు. కొంతసమయం తర్వాత చుట్టు పక్కల వాళ్లు గట్టిగా కేకలు వేస్తుండటంతో ఏమైందని బయటకు వచ్చి చూడగా.. పల్సర్‌ బైక్‌ మంటల్లో కాలి బూడిదైంది. ఎవరైనా బైక్‌కు కాల్చారా, లేదా బైక్‌ నుంచి మంటలు వ్యాపించాయా అనేది తెలియలేదు. ఘటనపై బాధితుడు సంతోష్‌ కుమార్‌ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరైనా నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.